ప్రజాశక్తి
శనివారం 13 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు



చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - అనంతగిరి:స్థానిక బస్ స్టాప్ వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక సిపిఎం సర్పంచ్ సోమ్మెల రూతు, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రూతు మాట్లాడుతూ, ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో టోపీ ధరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శెట్టి బాలకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు, ఉప సర్పంచ్ పి.అర్జున్, వార్డు మెంబర్ చిటం వెంకటరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కార్యదర్శి


ఇంటర్ ఫలితాల్లో మెరుగుదల

గతం కంటే పెరిగిన ఉత్తీర్ణతా శాతం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 48 శాతం ఉత్తీర్ణత వచ్చింది. జిల్లాలో ఇంటర్ ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి.. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 4,542 మంది పరీక్షలకు హాజరు కాగా 3,172 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా ఇంటర్ మొదటి సంవత్సరంలో 5,623 మంది పరీక్షలు రాయగా 26 89 మంది ఉత్తీర్ణులు అయ్యారు. గత ఏడేళ్లలో ఇంటర్ ఫలితాలను పరిశీలిస్తే ఈసారి రాష్ట్రంలోనూ జిల్లాలోనూ కూడా ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెరిగింది. జిల్లాలో ఇంటర్ ఒకేషనల్ జనరల్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు.

దుంబ్రిగుడ: స్థానిక కేజీబీవీ బాలికల జూనియర్ కళాశాలలో 98 శాతం ఉత్తీర్ణతను విద్యార్థులు సాధించారు. ఇంటర్ ఎంపీసీ మొదటి ఏడాదిలో 37 మంది విద్యార్థులకు 36 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 32 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి ఏడాదిలో 89 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ద్వితీయ సంవత్సరంలో 27 మంది పరీక్షలకు హాజరు కాగా 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 98 శాతం వచ్చింది.

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఏడాదిలో విద్యార్థులు 195 మంది పరీక్షలకు హాజరుకాగా అందులో 68 మంది ఉత్తీర్ణత సాధించగా 34 శాతం వచ్చింది. ద్వితీయ సంవత్సరంలో 107 మంది విద్యార్థులు హాజరు కాగా 80 మంది ఉత్తీర్ణత సాధించగా 74 శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు అధ్యాపక సిబ్బంది తెలిపారు. గతంలో పోలిస్తే ఈ ఏడాది స్థానిక జూనియర్ కళాశాల, కేజీబీవీ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెరిగింది.



ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ ఇంటర్‌లో 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు తెలిపారు. శుక్రవారం ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 35 మంది హాజరు కాగా 19 మంది, ప్రథమ సంవత్సరం పరీక్షలకు 45 మంది హాజరుకాగా 9 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ద్వితీయ ఇంటర్ సిఇసి గ్రూపులో కె.సలోమి 1000 మార్కులకు గాను 708 మార్కులు, ప్రథమ ఇంటర్‌లో కె.పావని 500కి గాను 360 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు ఫీజు చెల్లించాలన్నారు.



పావని సలోమి



సంతలో భారీగా ఉన్న చింతపండు బుట్టలు

పాడేరు సంతకు భారీగా చింతపండు

జోరుగా విక్రయాలు - తరలివచ్చిన వ్యాపారులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మన్యంలో జోరుగా చింతపండు విక్రయాలు జరుగుతోంది. గిరిజన రైతులు దీన్ని వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలలో ఏజెన్సీలో ముమ్మరంగా చింతపండు క్రయ విక్రయాలు జరుగుతాయి. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మన్యంలో చౌక ధరలతో పాటు నాణ్యమైన సరకు దొరుకుతుందని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తుంటారు. దీంతో గిరిజన రైతులు చింతపండు అమ్మకాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు.

పాడేరులో శుక్రవారం జరిగిన వారపు సంతకు చింతపండు అధిక మొత్తంలో వచ్చింది. పాత బస్ స్టాండ్ అంబేద్కర్ సెంటర్ కు వివిధ గ్రామాల నుంచి నుంచి గిరిజన రైతులు చింతపండును ఎక్కువగా బుట్టలతో తీసుకువచ్చి అమ్మకాలు జరిపారు. ఈ సెంటర్‌లో ఎక్కడ చూసినా చింతపండు బుట్టలే తెల్లవారు నుంచి ఉదయం 10 గంటల వరకు దర్శనమిచ్చాయి. మైదాన ప్రాంతాలతో పాటు, స్థానిక వ్యాపారులంతా పోటా పోటీగానే చింతపండును కొనుగోలు చేశారు. 15 కిలోల బరువుతూగే బుట్ట చింతపండును రూ.400ల నుంచి రూ.500 ధరతో వ్యాపారులు కొన్నారు. పాడేరులో భారీగానే చింతపండు మార్కెట్ జరగడంతో ప్రైవేటు వ్యాపారాలు కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలించారు. అలాగే స్థానిక ప్రజలు కూడా తమ ఇంటి అవసరాలకు సరిపడే చింతపండును కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం గిరిజన సహకార సంస్థ (జిసిసి) పాడేరు, చింతపల్లి డివిజన్ లలో చింతపండు కొనుగోళ్లను ప్రారంభించింది. కెజి చింతపండుకు రూ.32, పిక్క తీసిన పండుకు రూ. 63 చొప్పున ధర ప్రకటించింది. ఈ ఏడాది 200 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది.



చింతపండును సంతకు తీసుకెళుతున్న గిరిజనులు



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఇవిఎంలు, వివి ప్యాడ్‌లపై పోలింగ్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రంపచోడవరం నియోజకవర్గం ప్రొసీడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులకు శుక్రవారం స్థానిక లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఇవిఎంలు, వివి.ప్యాడ్‌లపై అవగాహనకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 59 మంది సెక్టర్ అధికారులను, 73 మంది రూట్ అధికారులను నియమించినట్లు చెప్పారు. రంపచోడవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు సంబంధించిన 307 మంది పిఓలు, ఏపీఓలకు ముందుగా ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బంది పక్కాగా శిక్షణ పొందాలన్నారు. ఓటర్లతో ఎటువంటి తగాదాలకు తావు లేకుండా చాలా జాగ్రత్త వహించాలని సూచించారు. రెండు గంటలకు ఒక్కసారి ఎన్నికల పోలింగ్ శాతాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం హ్యాండ్ బుక్ తప్పనిసరిగా ఫాలో అవ్వాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, ఎవి.రమణ, డివి.సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్లు యన్‌వివి.సత్యనారాయణ, బి.రాజు, చైతన్య, బాలాజీ, శివ, శ్రీధర్, విశ్వనాథం, స్వామి, జి.సత్యనారాయణ, వీరభద్రరావు, సరిత, ఆర్ఐ యన్.విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరా బాయ్, లక్ష్మణ్, వీఆర్వోలు, పిఓలు, ఎపివోలు పాల్గొన్నారు.

పునరావాస సౌకర్యాలను వినియోగించుకోవాలి

- ఎస్‌పి తుహిన్ సిన్హా
- పాడేరులో మాజీ మావోయిస్టులతో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్‌సిన్హా

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా పోలీసు కార్యాలయంలో స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టులతో శుక్రవారం ఎస్‌పి తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.మావోయిస్టు పార్టీ కంచుకోటగా భావించిన పెదబయలు, కోరుకొండ మరియు గాలికొండ ప్రాంతాలకు చెందిన 86 మంది మాజీ మావోయిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీను వీడి సాధారణ జీవనం సాగిస్తున్న వారి అనుభవాలను, సామాజికంగా, ఆర్థికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా జిల్లా ఎస్‌పితో పంచుకున్నారు. సరెండర్ అయిన తర్వాత ప్రభుత్వం కల్పించిన పునరావాస సౌకర్యాలు, పోలీసుల సహాయ సహకారాలపై వారు సంతృప్తిని వ్యక్త పరిచారు. పోలీసు శాఖపై తమకు అమితమైన నమ్మకం ఉందని మరలా ఎట్టిపరిస్థితులలోనూ మావోయిస్టు పార్టీ వైపు మొగ్గు చూపమని తెలిపారు. తమ గ్రామాలకు మావోయిస్టులు వస్తే ఎటువంటి సహాయ సహకారాలు అందజేయమని ఎస్.పి ఎదుట ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ, సరెండర్ అయిన మావోయిస్టులకు ప్రభుత్వం కల్పించిన అన్ని పునరావాస సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజంలో ఉన్నత జీవనం సాగించి, ఆదర్శంగా నిలవాలన్నారు. మరలా మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులు కాకూడదని తెలిపారు. సంఘ విద్రోహ శక్తులైన మావోయిస్టులు గ్రామాలకు వస్తే వారిని గ్రామం నుండి తరిమి వేయాలని పిలుపునిచ్చారు. అధికారులకు ఎన్నికల విధులలో సహకరించాలని, సజావుగా నిర్వహించేందుకు తోడ్పడాలని చెప్పారు. 'మీ కోసం నిరంతరం పనిచేసి పోలీసు వ్యవస్థ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు'. ఈ కార్యక్రమంలో డివిజన్లోని వివిధ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



కూంబింగ్‌కు నిర్వహిస్తున్న పోలీసులు

నేటి నుండి 16 వరకు మావోయిస్టుల నిరసన దినాలు

అప్రమత్తమైన పోలీసులు - నైట్ సర్వీసు బస్సులు రద్దు

ప్రజాశక్తి -సీలేరు

చతీష్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్లో సుమారు 20 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందడం, భారీ పేలుడు సామాగ్రి పోలీసులు స్వాధీనం స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో పోలీసు చర్యలకు నిరసనగా ఈ నెల 12 నుండి 16 వరకు నిరసన దినాలు పాటించాలని మావోయిస్టుల పార్టీ అగ్ర నేతలు పిలుపునిచ్చారు. దీంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టు నుంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఎన్నికల వాతావరణం నెలకొనడంతో ముందస్తు చర్యల్లో భాగంగా మావోయిస్టు కదిలికలపై నిఘా పెడుతూ స్పెషల్ పార్టీ బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా చర్యల చేపట్టారు. మావోయిస్టులు నిరసన దినాలకు పిలుపునివ్వడంతో పోలీసుల ఆదేశాలు మేరకు ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా విశాఖపట్నం నుంచి వయా సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులతో పాటు రాత్రివేళ తిరిగే అన్ని ఆర్టీసీ బస్సులు రద్దు చేశారు. నిరసన దినాలు నేపథ్యంలో మారుమూల గ్రామల గిరిజనుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది.

ఎస్ఐ ఆధ్వర్యాన తనిఖీలు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన సీలేరు తదితర ప్రదేశాల్లో శుక్రవారం ఎస్సై రామకృష్ణ ఏరియా డామినేషన్, కుమింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మావోయిస్టుల కదిలికలపై ప్రత్యేక దష్టి సారించామని, సిఆర్‌పిఎఫ్, పోలీస్ బలగాలతో విస్తృత తనిఖీలు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.



భర్తతో కలిసి నిరీక్షిస్తున్న బాలింతరాలు

తల్లీ బిడ్డ అంబులెన్స్ కోసం
బాలింత ఎదురుచూపు

ప్రజాశక్తి-అనంతగిరి:ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలు ప్రసవం అనంతరం ఇంటికి చేర్చేందుకు ఏర్పాటు చేసిన తల్లి బిడ్డ అంబులెన్స్ పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో లేకపోవడంతో రోజంతా తల్లీ బిడ్డ అరుబయటే వేసి ఉండవలసిన పరిస్థితి చోటు చేసుకుంది. అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ పరిధి చీడీవలస గ్రామానికి చెందిన కిల్లో, వసంతను ఈనెల 8న గ్రామం నుండి కొండ కోనల నడుమ నుండి తరలిస్తుండగా మార్గం మధ్య లో బిడ్డ ను ప్రసవం జరిగిన విషయం తెలిసిందే. హుకుంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాడేరు ఆసుపత్రికి తరలించారు. వారం రోజులుగా వైద్యం అందించిన ఆస్పత్రి సిబ్బంది శుక్రవారం డిస్‌చార్జి చేవారు. తల్లి బిడ్డ అంబులెన్స్ ఆసుపత్రి నుండి గ్రామ వరకు ఏర్పాటు చేయలేదు. దీంతో బాలింత వసంత భర్తతోపాటు రోజంతా ఆసుపత్రి ఆరుబయటే అంబులెన్స్ కోసం వేసి ఉన్నారు.ఈ విషయం విశాఖ జిల్లా సిపిఎం కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావుకు తెలియడంతో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫోను ద్వారా కోరినా ఫలితం లేదు. ఐటిడిఎ పిఒకు ఫోను ద్వారా ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన సాయంత్రం 6 గంటలకు అంబులెన్స్ ఏర్పాటు చేసినట్లు గోవిందరావు పేర్కొన్నారు.

ఇటుకల పండగ ప్రారంభం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఏజెన్సీలో ఇటుకల పండగ ప్రారంభమైంది. ఈ పండుగను గిరిజనులు ప్రాంతాల వారీగా నెలరోజుల పాటు జరుపుకుంటారు. మండలంలో శుక్రవారం కురిడి, జంగిడి వలస ప్రాంత గ్రామల్లో పండగను జరుపుకున్నారు. గిరిజన సంప్రదాయబద్ధంగా గిరి మహిళలు అరకు, పాడేరు ప్రధాన 516ఇ హైవే రోడ్డుపైన జంగిడి వలస, కురిడి గ్రామ మహిళలు తాళ్లతో గేట్లు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారుల నుంచి పజోర్ (చందా) వసూళ్ళు చేశారు.ఈ విధంగా వసూలు చేయడం గిరిజనుల సాంప్రదాయం. ఈ విధంగా వారం రోజులు పాటు చందా వసూలు చేసిన డబ్బులతో గిరి మహిళలు సరదాగా ఏదో వస్తువులు కొనుగోలు చేసు కుంటారు. సుమారు నెలల రోజులపాటు గిరిజన గ్రామాల్లో పండగ సందడి ఉంటుంది.



చందాలు వసూలు చేస్తున్న మహిళలు

ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ సభ్యుడు బోండా సన్నిబాబు



కరపత్ర ప్రచారం చేస్తున్న ఎస్.సూరిబాబు

ప్రజాశక్తి- పెదబయలు

సిపిఎం ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని మండలంలోని అడవులు పుట్టు పంచాయతీ అడుగులు పుట్టు, వడ్డే కొడా పుట్టు, సిందిపుట్టు గ్రామాల్లో ఆ పార్టీ నేతలు శుక్రవారం ప్రచారం చేపట్టారు. వడ్డే పుట్టు గ్రామంలో జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, నిరంతరం గిరిజన సమస్యలపై పోరాడే సిపిఎం ఎంపీ అభ్యర్థి పి.అప్పల నర్సను చట్టసభల్లో పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇప్పటికే గిరిజన హక్కులు, చట్టాలను రద్దు చేసిందన్నారు. జీవో 3 రద్దు కావడంతో చదువుకున్న యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలు పొందలేక పోతున్నారన్నారు.అటవీ సంపదను కొల్లగొట్టాలని ఇప్పటికే పార్లమెంటులో నూతన అటవీ పాలసీ సవరణ చట్టాన్ని బిజెపి తీసుకొచ్చిందన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న అటవీ సంపదను బడా పెట్టుబడిదారులైన అదాని, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తుందని విమర్శించారు. ఇందులో భాగంగానే చింతపల్లి ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టును ప్రైవేట్ పెట్టుబడిదారులకు కట్టబెట్టిందన్నారు. దీన్ని గిరిజనులందరూ ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నా, నిర్మాణం కొనసాగించాలని చూస్తుందని విమర్శించారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కే.సర్బన్న, జె. సునీల్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కౌసల్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : రానున్న ఎన్నికల్లో అరకు పార్లమెంట్ నియోజకవర్గం నుండి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.అప్పలనర్సను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు గిరిజన యువతకు, ప్రజలకు పిలుపునిచ్చారు. జీకే.వీధి మండలం వంచల పంచాయతీ మూనాగరపల్లి గ్రామంలో శుక్రవారం సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని గిరిజన యువతతో సమావేశమై మాట్లాడారు. గిరిజనులు సమస్యలపై అనునిత్యం సిపిఎం ఉద్యమిస్తుందని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజలకి మేలు చేసే విధంగా అనే కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ప్రజల సమస్యలపై నిత్యం పోరాడుతున్న పార్టీ సిపిఎం ఒక్కటేనన్నారు. మారుమూల గిరిజన గ్రామాల సమస్యల వాణి పార్లమెంట్లో వినిపించాలంటే గిరిజన చట్టాలు, హక్కులపై పూర్తి అవగాహన ఉన్న అప్పలనర్సను గెలిపించాలని కోరారు.

కొయ్యూరు : సిపిఎం ఎంపీ అభ్యర్థి పి అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ మండలంలోని చింతలపూడిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.సూరిబాబు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాన్ని మరో మణిపూర్‌లా తయారు చేయడానికి బిజెపి కుట్ర చేస్తుందన్నారు. అందుకే రకరకాల ప్రణాళికలు వేసి టిడిపి, వైసిపిని తమ వైపు లాక్కుంటుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వాన్ని ఓడించకపోతే గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గిరిజన యువతతో మాట్లాడుతున్న ఎంపిటిసి బుజ్జిబాబు

సిపిఎం అభ్యర్థులకే ఓట్లు వేస్తాం

రామవరం గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి-విఆర్.పురం

నిత్యం జనం సమస్యలపై స్పందించి పోరాడే సిపిఎం అభ్యర్థులకే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓట్లు వేస్తామని మండలంలోని రామవరం గ్రామస్తులు మొత్తం సిపిఎం నాయకులు ముందు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలో శుక్రవారం స్థానికులు జనరల్ బాడీ నిర్వహించి సిపిఎం నాయకులను ఆహ్వానించారు. ఇందులో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ చట్టసభల్లో సిపిఎం ప్రజా ప్రతినిధులు ఉంటేనే నిర్వాసితుల సమస్యలతో పాటు అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, జిఒ3లను నేటీ పాలకులు నిర్లక్ష్యంతో నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వీటి పగడ్బందీ అమలుకు రానున్న ఎన్నికల్లో సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి రంపచోడవరం నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి లోతా రామారావును, ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్సలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు పంపు సత్తిబాబు, వడ్లాది రమేష్, కారం సుందరయ్య, ఆసు లక్ష్మయ్య, జి లక్ష్మణరావు, తాతబాబు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



తీర్మానం అనంతరం నినాదాలు చేస్తున్న రామవరం గ్రామస్తులు, సిపిఎం నేతలు

ఉచిత ఉపకరణ నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-కూనవరం

అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యాన 18 సంవత్సరాల లోపు వికలాంగ బాల, బాలికలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్య సమన్వయకర్త కొమ్మ భాస్కరరావు మాట్లాడుతూ ఈ ఉచిత ఉపకారణాల శిబిరాన్ని వికలాంగులందరూ ఉపయోగించుకొని సదరం సర్టిఫికెట్లు తీసుకోవాలన్నారు. సీనియర్ ఐఈ రిసోర్స్ టీచర్ ఆర్ శ్యాంబాబు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు కూడా సాధారణ పిల్లలు మాదిరిగానే విద్యను అభ్యసించాలని, దీనిలో కలిగే ఆటంకాలు అన్నిటిని సమగ్ర శిక్ష ప్రత్యేకంగా నిర్మూలించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు. సహిత విద్యకు సంబంధించిన సహాయ ఉపకారణాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శిబిరానికి హాజరైన వికలాంగులకు అవసరమైన ఉపకరణాలను నమోదు చేసుకొని నాలుగు మండలాలలోని సమగ్ర శిక్ష వారికి అందిస్తామని చెప్పారు. కూనవరం, విఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాల నుండి హాజరైన తల్లిదండ్రులకు రానుపోను రవాణా చార్జీలు, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసెస్మెంట్ టెక్నీషియన్ టి కోటేశ్వరరావు, ఎంఈఓ-2 టి లక్ష్మయ్య, ఐఈ రిసోర్స్ టీచర్స్ కే కావ్య, బి వెంకన్న బాబు, ఎం జ్యోతి, పి సాయి చందన, ఎస్ విజయ, కే జయలక్ష్మి, సీతాపురం స్కూల్ అసిస్టెంట్ ఎస్. శాంతకుమారి పాల్గొన్నారు.



వికలాంగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

• ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు : జి.మాడుగుల మండలం సర్లుబి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అమిదేలు గ్రామానికి చెందిన విద్యార్థి వెంకటలక్ష్మికి సకాలంలో వైద్యం అందక మరణించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవన్ కృష్ణ, కార్తీక్ శ్రీను, మాజీ అధ్యక్షుడు ప్రభు దాస్ తెలిపారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, ప్రధాన ఉపాధ్యాయుడు, వార్డెన్ నిర్లక్ష్యంతో వెంకటలక్ష్మి చనిపోయిందని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారని తెలిపారు. హెచ్‌ఎం, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇప్పటికే దాదాపు 15 మంది విద్యార్థులు మృతి చెందారన్నారు. ఐటిడిఎ అధికారులు, స్కూల్ యాజమాన్యాల నిర్లక్ష్యంతోనే విద్యార్థులు చనిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో చదువుకుంటున్న విద్యార్థులకు వసతి గృహాలలో కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు హాస్పటల్‌కు తీసుకు వెళ్లడానికి హెల్త్‌వాలంటీర్లు లేరని పేర్కొన్నారు.

మరుగుదొడ్డి నిర్మాణ పనుల అడ్డగింత


పనులు అడ్డుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి- హుకుంపేట : మండల కేంద్రంలో గిరిజనుడు కొర్రా ఆనంద్ మరుగుదొడ్డి రేకులు వేస్తుండగా రెవెన్యూ అధికారులు శుక్రవారం పనులు నిలుపుదల చేశారు. అనంతరం బాధిత గిరిజనుడు మాట్లాడుతూ తన ఇల్లుకు హక్కు పట్టాలు 2012 సంవత్సరం నుంచి ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు మరుగుదొడ్డి నిర్మాణాన్ని ఎందుకు నిలుపుదల చేశారని ప్రశ్నించారు. మండల కేంద్రంలో విచ్చల విడిగా అక్రమ కట్టడాలు కడుతున్నా వాటిని ఎందుకు నిలుపుదల చేయలేదన్నారు. గిరిజనులు ఒక్క న్యాయం, గిరిజనేతరులకు ఒక్క న్యాయమా అని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనేతరుల అక్రమ కట్టడాలకు అండగా రెవెన్యూ అధికారులు ఉంటున్నారు. రెవెన్యూ అధికారులు గిరిజనేతరుల పట్ల ఎందుకు శ్రద్ధ వహిస్తున్నారని ప్రశ్నించారు.

శాంతకుమారికి టికెట్ కేటాయించాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన పాచిపెంట శాంతకుమారికి అరకు అసెంబ్లీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని మండలంలోని కూటంగి పంచాయతీ దాబారు గ్రామంలో ఆ పార్టీ కార్యకర్తలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల సీనియర్ నాయకుడు కె.రాజాబాబు మాట్లాడుతూ, రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి శాంతకుమారి అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. పార్టీ ఫిరాయించి వారికి టికెట్ కేటాయించడంతో పార్టీ నష్టపోవడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పెదబయలు మండల అధ్యక్షుడు కే.కోటటి, జే వెంకటబ్బాయి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సప్దర్ హష్మీ జయంతి

ప్రజాశక్తి -కరాస: ప్రజా కళాకారుడు, ప్రజా కళారూపాల సృష్టికర్త, వీధి నాటిక వైతాళికుడు కామ్రేడ్ సఫ్దర్ హష్మీ జయంతిని ప్రజానాట్యమండలి నగర కార్యాలయం హష్మీ భవనంలో శుక్రవారం నిర్వహించారు. హష్మీ చిత్రపటానికి ప్రజానాట్యమండలి సీనియర్ నేత అరుణ్‌జీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హష్మీ గొప్పతనాన్ని చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో .పద్మ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు

అదానికి హైడ్రో ప్రాజెక్టు అప్పగింతపై

అధికార, విపక్షాలు సమాధానం చెప్పాలి : సిపిఎం

ప్రజాశక్తి -పాడేరు:ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ స్టోరేజీలు అదానికి అప్పగింతపై అధికార, ప్రతిపక్ష పార్టీలు సమాధానం చెప్పాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. అదాని చేతికి ఏజెన్సీ హైడ్రో పవర్ ప్రాజెక్టు అప్పగింతపై ఓ దినపత్రికలో వచ్చిన దానిపై ఆయన స్పందించారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి ఎల్.సుందర్రావు, చిట్టిబాబుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాల నుంచి హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజనులు సాగిస్తున్న పోరాటం అధికార, ప్రతిపక్ష పార్టీలకు కనబడ లేదా అని ప్రశ్నించారు.దేశంలో ఉన్న అడవులను అదానికి అప్పగించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఆ రోజున గిరిజనులు పోరాటం చేస్తుంటే అంతా అబద్ధమని అధికార పార్టీ ఎమ్మెల్యే తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజనులు ఈ ఎన్నికల్లో తప్పకుండా ఆలోచించాలని సూచించారు. ఈ రెండు పార్టీల్లో ఏ పార్టీ గెలిచినా బిజెపికి తొత్తు గా మారడం తప్ప అడ్డుకొనే ప్రయత్నం చేయరని తెలిపారు.గిరిజనుల చట్టాలు, హక్కులకు నష్టం కలుగుతున్నా కనీసం స్పందించ లేదని విమర్శించారు. ఎర్రవరం పవర్ ప్రాజెక్టు నుంచి 12 మెగావాట్లు విద్యుత్తు, అనంతగిరి మండలం పెద్దకోట 100 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో విలువైన ఖనిజ సంపదను దోపిడీ చేయడానికి ఈ ఎన్నికల్లో దొంగల్లాగా వస్తున్నారన్నారు.గిరిజనులు ఓటుతో తరిమికొట్టాలని పిలుపు నిచ్చారు.


మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

గీతం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న గీతం ప్రతినిధులు

రూ. 14.25 లక్షల వార్షిక వేతనంతో అవకాశం

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రాంగణ నియామకాలలో మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు సత్తా చాటారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న మొత్తం 103 మంది గీతం విద్యార్థులకు అధిక వేతనంతో ప్రముఖ సంస్థలు ఉద్యోగాకాశాలు కల్పించాయని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ ఎస్.వంశీకిరణ్ సోమయాజుల తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులకు ప్రముఖ కంపెనీలు ఫెడరల్ బ్యాంక్, డెలాయిట్, ఎసెంచూర్, ఆక్సెన్ పాట్నర్స్, జైడూస్ వెల్‌నెస్, బెర్జర్ పేయింట్స్, ఏసియన్ పేయింట్స్, విప్రో, కన్స్యూమర్ కౌర్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, కోల్గేట్ అండ్ పామోలివ్, పిడబ్లుసి పెర్‌పెట్టినాన్, గోద్రేజ్ సంస్థలు ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలిచ్చాయి. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబిఎ తదితర కోర్సుల ఆఖరి సంవత్సరం విద్యార్థులకు రూ.14.25 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభించాయన్నారు. మరికొన్ని బహుళజాతి సంస్థలు గీతం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడానికి ఆసక్తి కనబరిచాయని కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ వి.రవికుమార్ తెలిపారు. విద్యార్థులకు కార్పోరేట్ సంస్థల అవసరాలకు తగిన విధంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ఈ ఎంపికలకు దోహదపడిందన్నారుఎంపికైన విద్యార్థులను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.ఫణి పప్పు అభినందించారు.

మాజీ సైనికుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో మాజీ సైనికుల ఆత్మీయ సమావేశం జరిగింది. విఘ్నేశ్వర అసోసియేషన్ అధ్యక్షుడు సాడి రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బూస రమణ, సెక్రటరీ చెన్నా నర్సింగరావు, జాయింట్ సెక్రెటరీ పల్లంటి జనార్ధన్, ట్రెజరర్ తాటిచెట్టి మోహన్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఆనందపురం ప్రెసిడెంట్ సాడి రమేష్‌రెడ్డి, భీమిలి చైతన్య అసోసియేషన్ ప్రెసిడెంట్ కె గురయ్యారెడ్డి, చిప్పాడ, గుడివాడ అసోసియేషన్‌ల అధ్యక్షులు సూరిబాబు, రవిశంకర్ మాట్లాడుతూ, మాజీ సైనికులంతా క్రమశిక్షణతో రాజకీయాలకు అతీతంగా ఉండాలని, అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి సమిష్టిగా పోరాడాలని నిర్ణయించారు. మాజీ సైనికుల అసోసియేషన్ కార్యాలయానికి స్థలం, ఇతర సమస్యలు పరిష్కరించే పార్టీకి సహకరించాలని నిర్ణయించారు.

18న 'గంటా' నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 18న భీమిలిలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కూటమి తరపున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల్లో కీలకఘట్టమైన నామినేషన్ దాఖలు సందర్భంగా భారీ ఎత్తున జన సమీకరణ ఒడేలా ఇప్పటినుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. మూడు పార్టీల ఆధ్వర్యంలో రెట్టింపు ఉత్సాహంతో నామినేషన్ ప్రక్రియ సాగాలన్నారు.. ఎన్నికల బరిలో ఉన్న రాజకీయ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టి, పోటీనుంచి తప్పుకునేలా ఈ ప్రక్రియ సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజబాబు, జనసేన నాయకులు ఇఎన్ఎస్ చంద్ర రావు, బిజెపి నాయకులు కె రామానాయుడు, టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు, వై అనిల్ ప్రసాద్ పాల్గొన్నారు

జీడి మామిడి, కాఫీ తోటల దగ్ధం


చింతపల్లిలో దగ్ధమైన తోటలు

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు మండలం దేవాపురం పంచాయతీ మారుమూల తుమ్మలపాలెం గ్రామంలో గిరిజన రైతులకు చెందిన 10 ఎకరాల జీడి మామిడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. వంతు పైడన్నదొర, నరసింహమూర్తి , పైడితల్లి రాజులమ్మ అనే గిరిజన రైతులకు చెందిన జీడి తోటలకు శుక్రవారం మధ్యాహ్నం మంటలు అంటుకున్నాయి . దీంతో కాపుకు వచ్చిన తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. జీడి మామిడి తోటలపై వచ్చే ఆదాయంతోనే ఆధారపడి బతుకుతున్నామని, సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత గిరిజన రైతులు కోరుతున్నారు.

చింతపల్లి : తమకు జీవనాధారమైన కాఫీ తోటలు అగ్నికి ఆహుతి కావడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని ఎర్రబొమ్మల పంచాయతీ బోయలగూడెం గ్రామానికి చెందిన కాఫీ రైతులు గగ్గోలు పెడుతున్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, ఈనెల 10న అర్ధరాత్రి సుమారు 21 ఎకరాల కాఫీ తోటలు అగ్నికి ఆహుతయ్యాయన్నారు. ఆ కాఫీ తోటల మీదే ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలన్నీ దిక్కుతోచని స్థితిలో ఉన్నాయన్నారు. ప్రతి ఏటా ఫలసాయాన్ని ఇచ్చే కాఫీ తోటలు అర్ధరాత్రి సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. ఐటిడిఏ అధికారులు స్పందించి తమకు నష్ట పరిహారం చెల్లించి అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

పలువురికి 'దాసరి' ఉగాది పురస్కారాలు


పురస్కారాలను అందజేస్తున్న ఆచార్య రాజు, తదితరులు

ప్రజాశక్తి- సీతమ్మధార : దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న సంయుక్త నిర్వహణలో క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం శుక్రవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. నటభూషణ్ శోభన్‌బాబుకు అంకితమిస్తూ పలువురికి పురస్కారాలను సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జిఎస్ఎన్.రాజు అందజేశారని నిర్వాహకులు పిఎ. భాస్కరరావు తెలిపారు. సంఘ సేవకుడు కాకినాడ రాయపల్లి శ్రీనివాస్, తప్పెటగుళ్ల కళాకారుడు నేల బోనుసత్యం, కోనసీమ కూచిపూడి కళాకారిణి సత్యవాణి రావి, రచయిత కిల్లాన శ్రీనివాసరావు, న్యాయవాది ఆకుల గణేష్, గాయని మామిడి మాధురి, రంగస్థల టీవీ నటులు ఈమంది ఈశ్వరరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి బి చిన్ని యాదవ్, శోభనబాబు నట ప్రావీణ్యుడు ఈ.గంగరాజు, పశ్చిమగోదావరి జిల్లా నర్తకుడు కోపల్లె వెంకట శ్రీనివాసరావు తదితరులు ఉగాది పురస్కారాలను పొందారు. ఈ సందర్భంగా దాసరి కల్చరల్ అకాడమీ సేవలను అతిథులుగా ప్రొఫెసర్ కె.చంద్రమౌళి, సినీ నటుడు ప్రసన్న కుమార్, దర్శకుడు దుగ్గివలస దివాకర్, 'ఫా' డైరెక్టర్ సన్ మూర్తి, కళానిర్వాహకుడు బొమ్మిడి సత్యనారాయణ, రాయపల్లి శ్రీనివాస్, తొగర సూర్యారావు, తిలక్ పట్నాయక్ తదితరులు కొనియాడారు. మల్లిక, చింతా ప్రభాకర్, బంగారాజు, అడవి రాజు , రవి నాగ్ పాల్గొన్నారు. స్థానిక కళాకారుల ప్రదర్శనన ఆకట్టుకుంది.


మాట్లాడుతున్న ఎంపిటిసి సభ్యురాలు అమ్మాజీ

మహిళలను మోసం చేసిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-కూనవరం : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం జగనన్న చేయూత పథకం కింద డబ్బులు జమ చేయకుండా మహిళలను మోసం చేసిందని పెద్దఆర్కూర్ ఎంపీటీసీ సభ్యులు ధర్ముల అమ్మాజీ విమర్శించారు. జగనన్న చేయూత పథకం పేరుతో అట్టహాసంగా మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసిన స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో అమ్మాజీ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాలుగు మండలాల నుండి జనాలను వాహనాలపై తరలించి తమ బలాన్ని ప్రదర్శించుకునే ప్రయత్నం చేశారే తప్ప, మహిళలకు మేలు జరగలేదన్నారు. మహిళలు చేయూత డబ్బులు కోసం బ్యాంకులకు వెళ్తే డబ్బులు ఇంకా జమ కాలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఇలా మహిళలను మోసం చేయడం ఒక మహిళా ఎమ్మెల్యేకు తగదన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఎన్నికల వేళ ఇటువంటి మోసపూరిత మాటలను ఆపాలని హితవు పలికారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు బాబు బొర్రయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, పాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం మండలం, సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈ నెల 14న ఆదివారం రాజమహంద్రవరం రామకృష్ణ మిషన్ వారిచే ఉచిత సాధారణ వైద్య శిబిరం, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు, కళ్ళ జోళ్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయానికి తరలించనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగ పరుచుకోవాలని స్వామీజీ తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని ఉమాదేవి అన్నారు. మండలంలోని డౌనూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం స్థానిక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొయ్యూరు మండలంలో సుమారుగా 680 మట్టి నమూనాలు తీయాలని సిబ్బందికి సూచించారు. భూసార పరీక్షలు వలన భూమిలో ఉన్న సారాన్ని అంచనా వేసి వాటికి అనుగుణంగా ఏ ఎరువు ఎంత మోతాదులో వేయాలో, భూమిలో ఉన్న సూక్ష్మ పోషకాలు గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. రైతులు తమ భూమిలోని మట్టి నమూనాలను సంబంధిత రైతు భరోసా కేంద్రానికి తీసుకొస్తే పరీక్ష చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రాజేష్, ఎంపీఈవోలు మాధవి, సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

42 మంది గ్రామ వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-చింతూరు : మండల కేంద్రం చింతూరు సచివాలయం పరిధిలో పని చేస్తున్న 42 మంది గ్రామ వాలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అనిల్‌కి రాజీనామా పత్రాలు అందజేశారు.

చిరస్మరణీయుడు మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి

తృతీయ వర్ధంతి సభల్లో సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విఆర్ పురం

ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి ఏజన్సీ ముద్దు బిడ్డ, అందరికీ ఆదర్శప్రాయుడు, చిరస్మరనీయుడని సిపిఎం నేతలు పేర్కొన్నారు. బొజ్జి మూడవ వర్ధంతి కార్యక్రమం ఆయన స్వగ్రామం మండలంలోని అడవి వెంకన్నగూడెంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఎంపీపీ కారం లక్ష్మి జెండా ఆవిష్కరించారు. బొజ్జి స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి సిపిఎం మండల కమిటీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ బొజ్జి గ్రామ సర్పంచ్ నుండి ఎమ్మెల్యేగా ఎదిగారని, మూడు సార్లు ఎమ్మెల్యేగా వరుసగా ఎన్నికయ్యారని తెలిపారు. అయినా ఆయన కుమారులు నాగిరెడ్డి, జానకిరావు చాలా సాధారణంగా జీవిస్తున్నారన్నారు. చట్టసభల్లో గిరిజన హక్కుల కోసం, చట్టాల రక్షణ కోసం పోరాడారని గుర్తు చేశారు. కుంజా బొజ్జి స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు,


చింతూరులో నివాళ్లర్పిస్తున్న నాయకులు


అడవి వెంకన్నగూడెంలో నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

వడ్లది రమేష్, కారం సుందరయ్య, తాతబాబు, జి.లక్ష్మణరావు, కార్యకర్తలు, బొజ్జి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూనవరం : మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి మూడవ వర్ధంతి సభ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీ అమ్మాజీ, బాబు బొర్రయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : అమరజీవి కామ్రేడ్ కుంజా బుజ్జి తృతీయ వర్ధంతి సందర్భంగా శ్యామల వెంకటరెడ్డి భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు వెంకట్ మాట్లాడుతూ సీలేరు జల విద్యుత్ కేంద్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయించే విషయంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, కారం సుబ్బారావు, పోడియం లక్ష్మణ్, బీరబోయిన దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి - సీలేరు : ఎన్నికల్లో ఎటువంటి సమస్యలు సృష్టించకుండా సజావుగా జరిగేలా సహకరించాలని సీలేరు ఎస్సై రామకృష్ణ గిరిజనులకు పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పెద గంగవరంలో శుక్రవారం ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సామరస్యంగా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు గిరిజన యువత దూరంగా ఉండాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించొద్దని కోరారు.

మేలో పింఛన్ల పంపిణీ సజావుగా సాగేలా చూడండి

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సామాజిక పింఛన్ల పంపిణీలో ఏప్రిల్ నెలలో జరిగిన జాప్యం ఫలితంగా 65 లక్షల మంది పింఛనుదారులు పడ్డ తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వచ్చే నెల పింఛన్ల పంపిణీ సజావుగా సాగడానికి వీలుగా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ కోరింది. ఆ మేరకు సంస్థ ఉపాధ్యక్షులు, ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి.సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల పూర్వ ప్రధానాధికారి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ శుక్రవారం విశాఖలో కేంద్ర ఎన్నికల పరిశీలకులు రామమోహన్ మిశ్రాతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత పారదర్శక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. భేటీ విషయాన్ని, ఆ సందర్భంగా తాము లేవనెత్తిన అంశాలను సంస్థ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్ కుమార్ శుక్రవారం మీడియాకు వివరించారు. పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చాక పంపిణీకి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ఐటిడిఎ ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలో రైతులు పండించే జీడి పిక్కలను ఐటిడిఎ ద్వారా కొనుగోలు చేయాలని జీడి మామిడి రైతుల సంక్షేమ సంఘం మండల కన్వీనర్ మాకాడ బూరుగులయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక రైతులతో సమావేశమై మాట్లాడారు. జీడి పిక్కలను కేజీ రూ.150 చొప్పున బస్తా పిక్కలు రూ.12 వేలుకు కొనుగోలు కోరారు. కొయ్యూరు మండలంలో జీడి తోటలు 20వేల ఎకరాలలో ఉన్నాయని, వాటిపై 16వేల మంది గిరిజన, గిరిజనేతర రైతులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈఏడాది దళారులు ఉగాదికి రెండు రోజుల క్రితం బస్తా బిక్కలు రూ.8,300కు కొనుగోలు చేశారని, ఉగాది రోజు రూ.8,200 మాత్రమే కొన్నారని చెప్పారు. దళారులు సిండికేట్ అయి ప్రతి రోజు ధరను తగ్గిస్తున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగైదు సంవత్సరాల నుండి సీపీఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిట్టుబాటు ధర కోసం భారీ స్థాయిలో పోరాటాలు చేసి కొంత మద్దతు ధర సాధించుకొని దొంగ తూనికలకు అడ్డకట్ట వేసిందని చెప్పారు. అయితే ఐటిడిఎ ద్వారా జీడి పిక్కలు కొనుగోలు లేకపోవడంతో మళ్లీ పాత పద్ధతిలోనే దళారులు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐటిడిఎ ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, మాకాడ జగ్గారావు, వెలుగురు వెంకటేశ్వర్లు, సాగిన రాములు, గాం అచ్చియ్య దొర, పందిరి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు కాంగ్రెస్ టికెట్ వంతలకు ఇవ్వాలి

ప్రజాశక్తి -సీలేరు : పాడేరు నియోజవర్గ అసెంబ్లీ సీటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంతల సుబ్బారావుకి కేటాయించాలని జికె.వీధి మండలం గుమ్మరేవులు, దుప్పిలివాడ మాజీ సర్పంచులు బాబురావు, అలంక రాజు డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం దారకొండలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీలో వంతల సుబ్బారావు పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసి నియోజకవర్గ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పాడేరు నియోజకవర్గం నుండి పోటీ చేసి అధికంగా ఓట్లు తెచ్చుకున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో వేరొక్కరికీ టికెట్ కేటాయించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కష్టకాలంలో కూడా పార్టీని విడవకుండా పనిచేసిన వంతుల సుబ్బారావు వంటి నాయకులకు టికెట్ కేటాయించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం, పిసిసి అధ్యక్షురాలు షర్మిల ఆలోచన చేసి పాడేరు ఎమ్మెల్యే టికెట్ వంతల సుబ్బారావుకి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీలేరు, దారకొండ, గాలికొండ పంచాయతీల కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, కోర్ర రాంబాబు, శెట్టి చిన్నబ్బాయి, పి.మల్లు దొర, పి.బాబురావు, జి.బాబురావు, కే.సొన్ను, కొర్ర సన్యాసి, సీసా రాజు, వి. రామచందర్, కిలో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


వంట సామగ్రి అందజేస్తున్న ఆశ్రమ పాఠశాల సిబ్బంది

అగ్ని ప్రమాద బాధితులకు వంట సామగ్రి వితరణ

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఏజీ కోడేరు పంచాయితీ పరిధి మల్లేతోట గ్రామంలోని మార్చి 28న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పాఠశాల వెనుకలగల కాకవారి గుంపునకు చెందిన ఐదు కుటుంబాలను మల్లెతోట ఆశ్రమ పాఠశాల సిబ్బంది శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి బియ్యం, వంట సామగ్రి, గరిటేలు, ప్లేట్లు, దుప్పట్లు, స్త్రీలకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కారం చంద్రయ్య, ఉపాధ్యాయులు పూరి బీమ్మయ్య, భూమిరెడ్డి, ఆదినారాయణ, కన్నారావు, ప్రేమకుమారి, భార్గవి, సీత, సురేష్, వీర్రాజు, రామదాసు, శ్రీనివాసు, సత్యనారాయణ, నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.